# నిర్మల

మధ్యాహ్నం సరిగా ఒంటిగంట అయింది. విజయనగరం మహారాజావారి కోటసిపాయి గట్టిగా ఒంటిగంట కొట్టేడు. పాటలో పల్లవి అందుకున్నట్టు కాలేజీ బంట్రోతు ఆ శబ్దం అందుకుని టంగు-టంగు మంటూ గంటలు పరంపరగా కొంతసేపు కొట్టేడు. ఆ పూటకు విద్యాబోధ చాలించమని ఉపాధ్యాయులకూ, ఇక బసలకు వెళ్లండని విద్యార్థులకూ ఆగంట కొట్టడంమూలంగా హెచ్చరిక అయింది.

తూర్పు పడమర్లకు చాలా దూరం వ్యాపించివున్న కాలేజీ మేడమెట్లు ఎక్కటకూ, దిగుటకు మూడు మెట్లవరుసలు ఉన్నాయి. తూర్పుకొసను ఒకటి-పడమటి కొసను ఒకటి-మధ్యను ఒకటీ. తూర్పుకొస మెట్లవరస విద్యార్థినుల రాకపోకలకు ప్రత్యేకించబడ్డది. గంట కొట్టగానే కాలేజీ తరగతుల విద్యార్థినులంతా - పూల వనంలో పుష్పజాతులలాగుననూ, వాటిమీద యెగిరి నేత్రోత్సవం చేసే సీతాకోక చిలుకలలాగుననూ-అతి రభసంగా మెట్లు దిగివస్తున్నారు. వారి వైఖరిచూస్తే - బసలకు తిరిగి వెళ్లుతున్నట్టు కనబడలేదు. జట్టుగా అంతా ఒక్క దగ్గరకే-ఏదో కార్యం సాధించేటందుకు తొందరగా వస్తున్నారు. ఏమంటే మెట్లు దిగి, వారు గేటువైపు నడవడంలేదు. క్లాసులుండే గదులను ఆనుకొని-దక్షిణంగా ఉన్న చీడీమీదనుంచి - లేడీ వలంటీర్లలాగ - వరసగా, క్రమంగా, తొందరగా వస్తున్నారు.

నాటి నాలుగోఫారం క్లాసు, మధ్య మెట్లకు పడమటగా ఉన్న గదిలో ఉండేది-ఆ క్లాసు మేష్టరు - అన్నాజీరావుగారు. ఆయన క్లాసు గదిలోకే యీ విద్యార్థినీ బృందం అంతా బిలబిలలాడుతూ వస్తున్నారు. అందులో ఒక ఆమె "ఈయన పేరు అన్నాజీరావుగారు ఏమిటే? తమ్మాజీరావు అనేపేరు వినంకాదూ?" అని భోగట్టా చేసింది. "నీకు కొడుకుపుడితే ఆ పేరుపెట్టి ముచ్చట తీర్చుకో" అన్నది. ప్రక్కనున్న ఆమె, నవ్వుతూ—

ఇంతట్లో అన్నాజీరావు మేష్టారు కాళ్లజోళ్లు తొడిగి, మూలపెట్టుకున్న గొడుగు అందుకొని, తిరిగి రాబోతూ ఒక అడుగు వేశారో, లేదోగాని అంతలోనే విద్యార్థినీ బృందంలో చాలామంది ఆయన క్లాసు గదిలో ప్రవేశించారు. కొందరు గడప దగ్గిరా, కిటికీలదగ్గిరా సర్దుకుని బైటనే నిలబడ్డారు.

ఆడపిల్లలు - ఇంతమంది - ఒక్కమాటు తన క్లాసు గదిలో చొరబడ్డందుకు మేష్టారు విభ్రాంతులైనారు. వాళ్ళలో చాలామంది ఒకప్పుడు తనదగ్గిర ఫోర్తుఫారం చదివిన శిష్యురాళ్ళే! ఈ మధ్యనే ఆయనకు చాలా గొప్ప విపత్తు ప్రాప్తించింది. ఆయనే నేడు చెయ్యి గాల్చుకుని, వండుకుని, ఎక్కడ లేటు అవుతానో అనే భీతిచేత ఉడికీ ఉడకని మెతుకులిన్ని-ఉలుకూ-పలుకూ నోట పడేసుకొని-చచ్చి చెడి ఎలాగో వచ్చిపడి లేటు మార్కు కాకుండా రిజిష్టరులో సంతకం చేసి-ఏపూటకు ఆ పూట ఒడ్డునపడుతున్నారు. ఒంటి గంటకు

## "విరల్"

కడుపులో కరకర ఆకలి వేస్తున్నది-కాఫీహోటేలుకు తొందరగా పోదామనుకుంటూ ఉండగా—ఈ బాలికలమూక వచ్చిపడ్డది. ఎందుకోసం వచ్చినట్టు? ఆయనకి ఏమీ బోధపడలేదు—మోటుతనంగా వదుల్చుకొనిపోవడానికి వీలుగా లేదు. అయినా తన ప్రాత విద్యార్థినీ బృందం ఆకస్మికంగా తనను చేరవచ్చినప్పుడు—మానవుడుగానూ, వాళ్లి ఉపాధ్యాయుడుగానూ—వాళ్లి యోగక్షేమం అయినా అడగడం తన కనీస ధర్మం అనీ ఆయనకు తోచినది. "అమ్మాయిలూ? మీకూ, మీవాళ్లందరకూ క్షేమమా?" అని కుశల ప్రశ్న వేశారు. "దైవకృపవల్లనూ, మీ ఆశీర్వచనంవల్లనూ మా అందరికీ క్షేమమేనండి. కాని పాపం తమకే గొప్ప గ్రహచారం తటస్థించిందని ఈమధ్యనే విన్నాం!" డాక్టర్ జాన్సన్ జీవచరిత్ర వ్రాస్తూ లెస్లీ స్టీఫెన్ అన్నాడు కదా!

"ఒక నిర్భాగ్యుని జీవనం దుఃఖభాజనము చెయ్యాలంటే - వాని దౌర్భాగ్య దేవత భార్యావియోగంకంటె దారుణమైనకష్టం ఏదీ ప్రాప్తమయేటట్టు చేయలేదు." అన్నది, ఒక విదుషీమణి

"ఆ గ్రంథం రచించిన దొరకూడా అదే దురవస్థకు పాలుపడ్డాడు గనుకను, దెబ్బ చుఱుకుని సహాశమంటినది గనుకను, స్వానుభవంవల్ల ఆ కష్టం యెటువంటిదో బాగా అవగతం చేసుకొని అంతటి సానుభూతితో, అంత చక్కగా వ్రాయగలిగేడు. అట్లాంటిక్ మహాసముద్రపు పడమటి ఒడ్డుకు అవతల దేశాలలోమాట అది మన భరతభూమికి వర్తించదు" అన్నది, మరొక బుద్ధిమంతురాలు. ఆ మాట అందుకొని మరొక వివేకవతి "మన భరతభూమిలో పెళ్ళి కేవలం ఒక బొమ్మలాట! అందులో, భార్య చస్తే భర్త పచ్చగా మళ్ళీ పెళ్ళికొడుకవుతాడు-కట్నంకూడా మళ్ళీ పుచ్చుకుంటాడు. ఒక తుండుగుడ్డ పోతే మరో తుండు అమర్చుకున్నట్టు - ఒకర్తె చస్తే మరొకర్తెను అమర్చుకొని బాజాబజంత్రీలతో పల్లకి యెక్కి ఊరేగుతాడు! మన తెనుగు దేశంలో ఒక కవి - ఒకరి తరవాత మరొకర్తె - వరసగా ఎనమండుగుర్ని పెళ్లాడాడట!

అదే భర్త చస్తే-భార్య ఏమున్నది? వటమోడు-నిట్టాట - దీపపు సెమ్మె! పైను పంచా-బోడిగుండూ! సంఘంలో యావన్మందికీ గడ్డిపరకకంటే చులకన!" సుల్తానా బేగం ఇలాఅంది: "మా తురకసుల్తానులూ నవాబులూ-బాదుషాలూ-అరేఅలా! ఆడవాళ్లు పడుచుపిల్లలంటే-రాత్రికి పడకసరుకూ—ప్రొద్దుట పీకనరుకూ! సాఫ్-సఫాయ్. అంతే ఆడకూతురు బతుకు. చదవలేదా "అరేబియన్ నైట్సు?"

"ఏమైనా, మీ తురకలలోనూ, నెప్పుల లోనూకూడా కొంతనయమే-దెవ్వుడిచ్చిన జాతియినా మిగులుతుంది-తక్కిన బ్రాహ్మల్లో మరీఘోరం."

"తలలు బోడులైతే-తలపులు బోడులవుతాయా? చూడు! ఆ పందిరిపీధిలో ఆవిడ-రామేశ్వరంవెళ్లి జుత్తు తీయించుకుని వచ్చి ఏడాదికాలేదు అప్పుడే రెండు సార్లు పట్నంవెళ్లి వచ్చింది—"

"ఆవిడెను ఎందుకు అనాలంటాను. ఉప్పూ పులుసూ తినే మానవశరీరం

కొక్కోకశాస్త్రం: ప్రతి రు. 5. 20 సినిమా తారల చిత్రాలు గల పుస్తకం రు. 2. 100 చిత్రాలది రు. 8 పెద్దసైజు డ॥ 1 కి రు. 5. …మాళ్ ట్రేడర్స్, సౌత్ గేట్, మధురై.

మనసా వైరాగ్యం కలిగి భిక్షుణీ-సన్యాసీ-అయితే తప్ప-నిర్బంధించి-విరూపుల్ని చేస్తే శరీరోన్మాదం అణగారిపోతుందా? పోదు-"

"మేష్టారూ! క్షమించండి! మేం ఒక మాట విన్నాం. నిజం మీ వల్ల తెలుసుకుందాం అని యిలాగ వచ్చాం. మీరూ దైవాత్తూ ప్రాప్తించిన లోపం భర్తీ చేసుకుంటారట కాదూ!

"అట! యేవిటే? మన కాలేజీలో ఇంటర్ సీనియర్ చదువుతున్న అమ్మాయి-నిర్మలని-ఈయనికి ఇవ్వడానికి నిశ్చయం చేశారట-మేష్టారు చేసుకోడానికి ఒప్పుకున్నారట కూడాను. కట్నం మాత్రం లేదట!"

"ముసలి పెళ్లికొడుకులకు కూడా కట్నాలా?

"మేష్టారికి మధ్యాహ్నం అయింది-విభమొచ్యాపడి."

"మరి లుబ్బావధాన్లు చెప్పినట్లు-యాభయి యేళ్ళకే ముసలంటా వేమే?"

"మేష్టారుకి మైలసుద్ది కాగానే - పధ్నాలుగో నాటి రాత్రే లగ్నం కావలసింది-"

"ఇంగ్లండు రాజు ఏడో ఎడ్వర్డు చచ్చిపోతే శవాన్ని అలాగే అట్టేబెట్టి, అతని కొడుకు అయిదో జార్జికి అవసర పట్టాభిషేకం జరిగించారు. అపరకర్మ ఆ తరవాత వారం పదిరోజులికి జరిగింది. ఇంగ్లండు అరాజకంగా ఒక్క క్షణం ఉండదు.

"అదే విధంగా మన దేశంలో ఒకడి భార్య చచ్చిపోతే-మైల పోగానే-మగవాడు మరో పెళ్ళాన్ని ఇట్టే పెళ్ళాడేస్తాడు"

"ఎందు చేతనో?

"నేను ఒక శాస్త్రులుగార్ని నీలాగే అడిగితే ఆయన సమాధానం చెప్పేరు: ఏమని అంటే—భరతభూమిలో బ్రాహ్మణుడికి-మగవాడికి ధర్మశాస్త్రం నాలుగు ఆశ్రమాలు విధిస్తున్నది—1 బ్రహ్మచర్యం. 2 గృహస్థాశ్రమం. 3. వానప్రస్థం. 4. సన్యాసం. భార్య చచ్చిపోయి, తిరిగి పెళ్లాడనివాడు పై నాలిగింటిలో ఏ ఆశ్రమంలో వాడని చెప్పగలం? కనుక—ఆ భర్త తనకి భార్య లేనిలోపం—వెంటనే భర్తీ చేసుకోవాలట."

"బాగుంది—ముందు కొత్త పెళ్లాన్ని పెళ్లాడేసి, తరవాత పాత పెళ్ళాం అంత్యక్రియల పనిచూస్తే—ఇంగ్లండు రాజ సాంప్రదాయం అనుసరించిన వాళ్లం అవుతామేమో?"

"చాలా బాగుంటుంది—కాని రెండు కారణాలవల్ల అలా జరగడం సాధ్యం కాదు. ఏమంటే—(1) సిద్ధంగా కొత్త పెళ్ళి కూతురు అమరదు. ఒక వేళ అమిరినా—(2) మృతాశౌచం అంటారు. మైల పన్నెండు రోజులు దాకా పోదు. తరవాతగాని పెళ్లి వల్లపడదు."

అప్పుడు ఒక అమ్మాయి తక్కిన వాళ్లను "ఉండండర్రా" అని ఉరిమి, విచారించి

"మేష్టారూ! మా నిర్మలని మీకిచ్చి పెళ్లి చేయడం నిశ్చయం అయిందంటారా! లేదంటారా? నిశ్చయం అయితే పెళ్ళి ఎప్పుడు? మా దగ్గర దాచక నిజం చెప్పండి" అని తీవ్రంగా చూస్తూ, అన్నాజీరావుగారిని సూటీగా అడిగింది.

మేష్టారు "పెళ్ళి నిర్ణయమయిన మాట నిజమే. నెల దాటకుండా—శుభముహూర్తము ఎప్పుడు కుదిరితే—పెళ్ళి అప్పుడే" అని ఆయన జవాబు చెప్పేరు.

"అయితే—నేను - ఒకమాట అంటాను. మీరు కోపపడకండేం."

మే:—చెప్పు, అమ్మా! నీ మనస్సులో మాట స్పష్టంగా చెప్పు. సంశయించకు."

"థాంక్స్ — మేష్టారూ — నాకు ఆస్వతంత్రం ఇచ్చినందుకు థాంక్స్—మరీ-మా నిర్మల మీదగ్గిర ఫోర్తుఫారమ్ చదువుకుందా? లేదా?"

మేష్టారు: "జ్ఞాపకంగా చెప్పలేను. అయితే నా స్టూడెంటు అయి వుండవచ్చును టెన్నిసన్ రాసినట్టు నా మేష్టరీ: "Students may come and students may go-But I go on for ever—కనీసం పాతిక ఏళ్లి దాకా. నిర్మల నా వద్ద చదివి ఉండవచ్చు-"

"చదివితే మీ కుమార్తెవంటిది. లేకపోతే మీ ఉభయుల వయస్సుల తేడాలనిబట్టి చూస్తే—మీరు తాతగారూ, ఆ అమ్మాయి మీ మనమరాలు—లాగ కనబడుతుంది. మీకు కూతురో, మనమరాలో అనుకోతగ్గ బాలికను తగుదునని మీరు పెళ్లాడడం ఏమి యోగ్యంగా ఉంది? — ఆలోచించి చూచారా?... మీరు యీ ఉద్యోగం ఇంక—మహా చేస్తే—ఐదేళ్లు—ఆతరవాత-కాలేజీ అధికార్లు-"తప్పుకోండి మేష్టారూ-పైకి నడవండి" అంటారు. రోజూ రెండు పూట్లా నోరు నొప్పెట్టేలాగ అరిచి పాఠాలు చెప్పే మేష్టర్లు-నిశ్శబ్దంగా రాసుకుంటూ ఆఫీసు పని చేసే గుమాస్తాల్లాగ-అట్టేకాలం బతకలేరు. దక్షిణం నుంచి కాలుడు మిమ్మల్ని 'కాల్' చేస్తాడు. మీదారిని మీరు వెళతారు. ఇప్పుడు పెళ్లాడబోయే ఆవిడ-జీవితాంతందాకా బతకాలి. మీరు నిష్క్రమించిన పదో నాటితో ఆవిడ పసుపూ-కుంకుమా-వగైరా-ఫైసల్. రేవులో మంగలి యెదట కూలబడి సిగ చేతికిస్తుంది-సంఘం. గిరీశం చెప్పినట్టు-పదేపదే క్షౌరం. మీ ప్రాణానికి ఉసూరుమంటూ మీ వితంతువుని ఎంత కాలం బతకమంటారు? మేష్టారూ. దూరం ఆలోచించండి. నిర్మల తల్లీ-తండ్రీ నిరుపేదలు. ఈడువచ్చిన పిల్లను పెళ్ళి చేయకుండా ఇంట వుంచుకోవడం బహుభారం. ఆ అమ్మాయిని ఎలాగో వదుల్చుకుందాం. కట్నం లేకుండా పెళ్లి చేసి పంపించేదాం. ఆతరవాత దాని కర్మానికి మేం ఏం చేస్తాం అని - తప్పించుకోవడమునకు వాళ్లు యత్నిస్తున్నారు-దొరికినదే దొండపండని మీరు చూస్తున్నారు. మన సంఘం యొక్క ఈ దురవస్థ బాగుపడడానికి ఎవరు ఏమి చెయ్యాలో బోధపడడము లేదు-వెనక అరేబియాలో ఆడపిల్ల పుట్టగానే ఇసకలో కప్పెట్టేసేవారు-ఆడపిల్ల పుట్టగానే మనం చంపేస్తే-గవర్నమెంటు మనల్ని ఉరిదీస్తుంది - ఈ పసిపిల్లల్ని పెంచి, పెద్దవాళ్ళను చేసి, విద్యాబుద్ధులు చెప్పించి, తగిన వరుడికి ఇచ్చి, పెళ్లి చెయ్యడం బహుకష్టసాధ్యం. నిర్మల చాలా తెలివైనపిల్ల. పేదల కడుపున పుట్టింది. ఎవరో కొందరు చందాలు వేసుకొని - పనికొచ్చే పిల్ల గదా అని చదివిస్తున్నారు. ఆవిడకు వివాహం ఇష్టం లేదు - కన్యగానే ఉండి పెద్దచదువు చదివి సంఘ సేవ చెయ్యాలనే సంకల్పంలో వుంది. ఇష్టంలేని పిల్లని బలవంతంగా పెళ్లాడి మీరేం సుఖపడతారు? ఆవిడను ఏం సుఖపెడతారు? బాగా ఆలోచించి మరీ అడుగు వెయ్యండి. దేవపారిజాత పుష్పంవలె నిర్మల అయిన మా నిర్మల గొంతు కోయకండి. మీ వయస్సుకీ - అభిరుచికీ తగినదీ - మీ ఆర్జన మీద ఆధారపడకుండా స్వతంత్రంగా జీవనం చెయ్యగలదీ దొరికితే-ఒక పూర్వసువాసినిని పెళ్లి చేసుకోండి. ప్రయత్నించండి. ఇపుడు మాత్రం ఈ పెళ్ళి చేసుకోనని మా అందరియెదట మీరు బహిరంగంగా ప్రకటించాలి" అని ఒక విద్యార్థిని చేసిన గంభీరోపన్యాసం చెవులప్పగించి విని, తాను నిర్మలను వివాహం చేసుకోవడం వల్ల రాగల విపత్పరంపరను మనో నేత్రంతో స్పష్టంగా మేష్టారు చూచారు. ఆయనకుం డె ప్రబద్ధలైపోయింది-ఆదౌరన్యం ఎంత దారుణమైనదో ఆయనకు కళ్లకు కట్టినట్టు అయినది. గద్గదస్వరంతో ఆయన ఇలా అన్నారు: "అమ్మాయిల్లూ!- ఊబిలో పడి కూరుకుపోకుండా నన్నూ, నా బారిని పడకుండా-దేవపారిజాతపుష్పంవంటి కన్యకామణి-నిర్మలనూ సంరక్షించి మీరు ధన్యలైనారు. కృతజ్ఞతాపూర్వకంగా మిమ్మల్ని ఆశీర్వదిస్తున్నాను-స్వార్థం త్యజించి చాలామంది కన్యకలు సంఘోద్ధరణ-దేశోద్ధరణలకు పూనుకుంటే నేగాని దేశం బాగుపడదు. నాకు బాగా బుద్ధి చెప్పినారు-నేను ఇక ఏకన్యకనూ పెండ్లి చేసుకోను - భగవత్ సాక్షిగా చెప్తున్నాను-నమ్మండి. మీరు భారత భాగ్యదేవతలు. భావితరం ప్రజానీకానికి మాతృదేవతలు. నాకన్ను విప్పి—పన్నైనా నాకర్తవ్యం బాగా ఉపదేశం చేశారు. భగవంతుడు మీకు ఆయురారోగ్య ఐశ్వర్యములిచ్చి వీరమాతలు అయ్యేటట్లు వరమిచ్చి ఆశీర్వదించమని చేతులు మోడ్చి నమస్కరిస్తున్నాను" అనేసరికి బాలికలంతా ఒక్కసారి చప్పట్లుచరిచి హర్షము వెల్లడిచేశారు. ★